భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 19.0


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సెక్టార్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భీమవరం,మార్చి 6 :ఎన్నికల సందర్భంగా సెక్టార్ అధికారులు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల సెక్టార్ అధికా రులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. సెక్టార్ పరిధిలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సెక్టార్ అధికారికి పోలింగ్‌కు వారం రోజుల ముందు మేజిస్ట్రేట్ అధికారాలు ఇస్తామన్నారు. జిల్లాలో మొత్తం 1,461 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 140 మంది చొప్పున సెక్టార్ అధికారులను నియమించామన్నారు. ఒక్కో సెక్టార్ అధికారికి సుమారు 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్ల విధులను కేటాయించామన్నారు.సెక్టార్ అధికారి ప్రతి పోలింగ్ స్టేషన్‌ను ఒకటికి, రెండుసార్లు పరిశీలించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వెంటిలేషన్, తదితర సౌకర్యాలలో లోటుపాట్లు ఉంటే వెంటనే ఆర్వో దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు ఇబ్బంది ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో అదనపు పోలీసు ఫోర్సు నియమించడంతో పాటు, మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణలో పోలింగ్ జరుగుతుందన్నారు. క్యూలైన్లతో నిమిత్తం లేకుండా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివనారాయణరెడ్డి, నరసాపురం ఆర్డీవో, ఈఆర్వో అచ్యుత అంబరీష్, పాలకొల్లు నియోజక వర్గం ఈఆర్వో అప్పారావు, ఆచంట నియోజకవర్గ ఈఆర్వో స్వామి నాయుడు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు సన్యాసిరావు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.


ఆకివీడులో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థినులు

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 6 : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 50 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా జనరల్ విద్యార్థులు 17,473 మందికి 16,906 మంది విద్యార్థులు హాజరవగా 567 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,930 మందికి 1718 మంది హాజరవగా 212 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి కాపీయింగ్, ఇబ్బందులు తలెత్తలేదని ఎగ్జామ్స్ కన్వీనర్ చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

రైతులకు భరోసా ఏదీ?



రైతులకు అండగా ఉంటూ తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తులు అందించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించి ఆర్గానిక్ పంటలను ఉత్పత్తి చెయ్యడానికి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడమే వీటి ప్రధాన కర్తవ్యం. అయితే ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో క్రయ, విక్రయాలు, యాప్‌ల నిర్వహణతోనే కాలయాపన జరుగుతున్నది. జిల్లాలో 409 రైతు భరోసా కేంద్రాలున్నాయి. విత్తనం నుంచి విక్రయం వరకు 30 రకాల సేవలందిస్తాయని ప్రభుత్వం చెబుతున్నది. కానీ లక్ష్యసాధనలో ఇవన్నీ తుస్సుమన్నాయి.

లక్ష్య సాధనలో ఆర్బీకేలు విఫలం

- క్రయ విక్రయాలకే పరిమితం
- పేరుకే వెటర్నరీ డిపార్టుమెంట్
- పశు సంపద వృద్ధికి చర్యలు శూన్యం
- నామమాత్రంగా హార్టికల్చర్, సెరీకల్చర్
- సబ్సిడీ పనిముట్లకు మంగళం
- రైతులకు అందని సాంకేతిక పరిజ్ఞానం

ఆకివీడు రూరల్, మార్చి 5: నాట్లు పడిన నాటి నుంచి సుమారు నెలరోజుల పాటు ఈ క్రాప్ నమోదు కార్యక్రమం జరుగుతుంది. తదుపరి ఎరువులు, పురుగుమందుల కోసం డిమాండ్‌ను తయారు చేసి పంపడం, పంటల బీమా, ధాన్యం కొనుగోలు, మిల్లర్లకు పంపిణీ, ఆన్‌లైన్ పేమెంట్‌లు కార్యక్రమంతో పంట కాలం పూర్తవుతున్నది. భూ పరీక్షల అనంతరం రైతులు ఎటువంటి ఎరువులు ఉపయోగించాలి ? ఎటువంటి విత్తనాలు సిద్ధం చేసుకోవాలి ? ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించడం వంటివి ఏమీ జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు గతంలో సొసైటీల ద్వారా అరువుకు లభించేవి. ప్రస్తుతం ఆర్బీకేలలో నగదుతో కొనుగోలు చేసుకోవాలి. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి, వర్షాల నుంచి కాపాడుకోవడానికి టార్పాలిన్ల సరఫరా లేదు. పురుగుమందుల పిచికారీకి స్ప్రేయర్లు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు సబ్సిడీపై అందజేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మేలు రకం విత్తనాలను పంపిణీ చేయడంలోనూ విఫల మైంది. రైతులు ప్రైవేటు వ్యక్తుల నుంచి వేలాది రూపాయలు చెల్లించి విత్తనాలు సేకరిస్తున్నారు.

ఆక్వాకు తోడ్పాటు లేదు

రైతు భరోసా కేంద్రాల్లో మత్యశాఖ కూడా ఉంది. అయితే ఈ శాఖ నుంచి ఆక్వా రైతులకు ప్రోత్సాహమే కరువైంది. గత ప్రభుత్వ హయాంలో వాహనాలు, యంత్ర పరికరాలు సబ్సిడీపై అందజేసేవారు.



ప్రస్తుతం వాటి ప్రస్తావనే లేదు. విద్యుత్ సబ్సిడీ కూడా ఆక్వాజోన్, పది ఎకరాలు మించి విస్తీర్ణం పేరుతో అందరికి అదడం లేదు. ప్రధానంగా నాణ్యమైన సీడ్ లేకపోవడం, ఫీడ్, ఉత్పత్తులు ధరలు నియంత్రణ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యాధుల నివారణకు మత్యశాఖాధికారులు చేసే సూచనలు, సలహాలు శూన్యమనే చెప్పాలి. ప్రైవేటు కంపెనీల టెక్నీషియన్స్ మీద మాత్రమే రైతులు ఆధారపడి సాగు చేస్తున్నారు. రైతుల కోసం ఒక సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు.

పశు సంపద వృద్ధికి చర్యలు శూన్యం

వ్యవసాయాధారిత రైతులతో పశు సంపద మమేకమై ఉంటుంది. రైతు భరోసా కేంద్రాలలో వెటర్నరీ డిపార్టుమెంట్ ప్రాధాన్యమైనది. పశు సంపద వృద్ధికి ప్రభుత్వం తీసుకునే చర్యలు శూన్యమనే చెప్పాలి. మేలు జాతి పశువులును సబ్సిడిపై అందించి పాల ఉత్పత్తులను గణ నీయంగా పెంచడానికి చర్యలు తూతూమంత్రంగానే ఉన్నాయి. గత ప్రభుత్వం పశువులు దాణా నిమిత్తం గడ్డిని సబ్సిడీపై అందజేయగా ప్రస్తుతం దాణా బ్యాగ్‌ల పేరుతో వస్తున్నది. ఇది నిలవ ఆగడం లేదని ఎక్కువ శాతం పాడైపోతున్నదని రైతులు వాపోతున్నారు. వ్యాధులు సోకకుండా చేసే వ్యాక్సినేషన్ తూతూ మంత్రం గానే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు పేడ నుంచి ఉత్పత్తి అయ్యే బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు, సేంద్రియ ఎరువులు ఉత్పత్తులు తయారీకి ప్రభుత్వ సహకార మందించడం లేదు. హార్టీ కల్చర్, సెరికల్చర్‌లు కూడా రైతు భరోసా కేంద్రాలలో భాగమే. వీటిని ఏర్పాటు చేశారు కానీ వాటిని ప్రోత్సహిం చేందుకు నిధులు కేటాయింపులు లేవు.

అరకొర సేవలకే పరిమితం

తణుకు : రైతు భరోసా కేంద్రాల ద్వారా అరకొర సేవలకే పరిమితతమైంది. నాణ్య మైన విత్తనాలు అందించడం, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచటం, సున్నా వడ్డీ రుణాలు, రైతు భరోసా, పీఎం కిసాన్, కౌలు రైతులు నమోదు, దాన్యం మిల్లులకు చేరవేయడం, దళారులు నుంచి రక్షించడం, పంటకోత ప్రయోగాలు, నష్టపోయిన పంట బీమా అంచనాలు తయారీ, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ఎలుకల నివారణ మందు పంపిణీ, యంత్రాలు, బర కాలు అందించడం వంటి సేవలు అందించాల్సి ఉంటుంది. వీటిలో కొన్ని మాత్రమే అమలు చేస్తున్నారు. రైతులకు అవసరమైన బరకాలు అందించడం లేదు. నట్టి నమూనాలు సేకరణ, రైతులు ఆధునిక శిక్షణ వంటి జాడేలేదు.

రైతులకు ఒరిగిందేమీ లేదు



ఎరువులు, పురుగుమందులు నగదుతో కొనుగోలు చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలకు తీవ్రంగా నష్టపోతున్న రైతులు పెట్టుబడులు పెట్టుకునే స్థితిలో లేరు. వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ లేదు. ఎలుకల మందు పంపిణీ తూతూమంత్రంగా చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు సమ యంలో పడిగాపులు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం లేదు.

-పూజారి వరప్రసాదు, రైతు, కళింగపాలెం

ఆక్వాకు సహకారమే లేదు



నాణ్యమైన సీడ్, ఫీడ్ లేదు. వాటిపై అధికారుల పర్యవేక్షణ లేదు. ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ పేరుతో విద్యుత్ సబ్సిడీకి గండి పడినా పట్టించుకోవడం లేదు. ఆఫీసులు చుట్టూ కాళ్ళరిగేలా తిరుగుతున్నాం. వ్యాపారస్థులు సిండికేట్ అయ్యి ధరలు తగ్గించినా అధికారులు చోద్యం చూస్తున్నారు. చెరువులలో ఉపయోగించే మందుల నాణ్యతను పట్టించుకునే నాధుడే లేదు. క్షేత్ర స్థాయిలో రైతులకు సలహాలు, సూచనలు కోసం ప్రైవేటు వ్యక్తులనే ఆశ్రయిస్తున్నారు.మత్యశాఖ ల్యాబ్‌లు రైతులకు ఉపయోగ పడడం లేదు.

-కొండవీటి సత్యనారాయణ, ఆక్వా రైతు, సిద్ధాపురం

సబ్సిడీ పనిముట్ల ఊసే లేదు




తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు సబ్సిడీపై ఇచ్చేవారు ప్రస్తుతం అటువంటివి ఏమీ లేవు. నాణ్యమైన ఎరువులు కూడా అందించడం లేదు. పంట కోత అనం తరం గోనె సంచులు కూడా సకాలంలో అందడం లేదు. పురుగు మందులపై సబ్సిడీ అందడం లేదు. ప్రస్తుతం వ్యవసాయం కష్టంగా మారింది. ఆర్బీకేలలో పురుగుమందులు సులభ వాయిదాల్లో తీసుకునే వెసులుబాటు కల్పిస్తామని మొదట్లో చెప్పారు. అది ఇప్పటికీ అమలు కావడం లేదు.

-సోమరాజు, గజ్జరపు శివసూర్యనారాయణ, వేల్పూరు



బీసీలకు పూర్వ వైభవం

తెలుగుదేశం-జనసేన డిక్లరేషన్‌పై సర్వత్రా హర్షం
వైసీపీలో బీసీలకు ప్రాధాన్యం సున్నా
ఆదరణ లేదు.. రాయితీలు లేవు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం-జనసేన బీసీ డిక్లరేషన్ ప్రజల్లో సానుకూల చర్చ జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు మొండి చేయి చూపారంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతిన్నామంటూ బీసీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇటువంటి తరుణంలో టీడీపీ-జనసేన కూటమి బీసీ డిక్లరేషన్ ప్రకటించింది. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల్లో గతంలో మాదిరిగానే 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని తేల్చి చెప్పింది. బీసీల హక్కులను కాపా డేందుకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామంటూ భరోసా ఇచ్చారు. బీసీ సబ్‌ప్లాన్‌కు ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు వ్యయం, స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు కేటాయింపు వంటి పథకాలు అమలు చేస్తామని తెలుగుదేశం కూటమి ప్రకటించడంతో బీసీ వర్గాల్లో హర్షం వ్యక్తమవు తోంది. వైసీపీ హయాంలో బీసీలకు రద్దు చేసిన 30 పథ కాలను తిరిగి పునరుద్ధరిస్తామన్న ప్రకటన ఊరట నిస్తోంది.

వైసీపీలో మొండిచేయి

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు మొండి చేయి చూపారు. రాయితీ రుణాలు రద్దు చేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు బీసీలకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి కొంతమందికి నామినేటెడ్ పదవులు కల్పించారు. కానీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించలేదు. మరోవైపు వృద్ధాప్య పెన్షన్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అన్ని ప్రభుత్వాలు అమలు చేశాయి. అందులో కేటాయించిన నిధులను బీసీ సంక్షేమ జాబితాలో కలిపేసుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెపుతోంది. తెలుగుదేశం హయాంలో ఆదరణ పథకాన్ని అమలు చేశారు. చేతివృత్తిదారులకు పరికరాలు అందించారు. రాయితీతో బీసీ రుణాలు కల్పించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవన్నీ అటకెక్కిపోయాయి.

స్థానిక సంస్థల్లో పట్టుకోల్పోయిన బీసీలు

స్థానిక సంస్థల్లో వైసీపీ బీసీలకు ప్రాధాన్యం తగ్గించింది. రిజర్వేషన్‌లు కుదిం చింది. తెలుగుదేశం హయాంలో స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 889 పంచాయతీలు ఉంటే అందులో 34 శాతం బీసీలకు దక్కేవి. అంటే 302 పంచాయతీల్లో బీసీ వర్గాలే సర్పంచ్‌లుగా ఎన్నికయ్యేవారు. వార్డు సభ్యులగానూ సముచిత ప్రాధాన్యం లభించేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రిజర్వేషన్‌లను 27 శాతం కుదించింది. దాంతో సుమారు 63 పంచాయతీల్లో బీసీలు ప్రాతినిధ్యం కోల్పోవలసి వచ్చింది. ఇదికూడా బీసీ వర్గాలను ఆగ్రహానికి గురి చేసింది. వైసీపీ ప్రభుత్వం బీసీలను అణచివేసే ప్రయత్నం చేస్తోందంటూ ఆ వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ సమయంలో బీసీల కోసం తెలుగుదేశం-జనసేన ప్రకటించిన డిక్లరేషన్‌పై సానుకూల చర్చ సాగుతోంది.

ప్రత్యేక రక్షణ చట్టంతో భరోసా



వెనుబడిన కులాల అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ జనసేన పార్టీలు పనిచేసేందుకు సాక్ష్యమే చంద్ర బాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రకటించిన బీసీ డిక్లరేషన్. జగన్ పాలనలో 26 వేల మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించారు. 300 మంది బీసీ వర్గాల వారిని హత్య చేశారు. అందుకే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం రూ.75 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను బీసీలకే ఉపయోగిస్తాం.

-తోట సీతారామలక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పునరుద్ధరణతో న్యాయం



బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ద్వారా ఆయా కులాలకు రక్షణ కవచం. 50 సంవత్సరాలకు పెన్షన్ అమలు చేయడం చాలా మంచి నిర్ణయం. చట్ట సభల్లో రిజర్వేషన్లు 33 శాతం కోసం తీర్మాణం చేసి కేంద్రానికి పంపించడం, స్థానిక సంస్థల్లో వైసీపీ ప్రభుత్వం తగ్గించిన రిజర్వేషన్లు పునరు ద్ధరించడం ద్వారా వారికి తగిన న్యాయం జరుగుతుంది.

-ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే

బీసీ సంక్షేమ పథకాలకు మంచిరోజులు



బీసీలకు సంబంధించిన పథకాలన్నీ వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. బీసీ సంక్షేమ పథకాలన్నీ పున రుద్ధరిస్తామని బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించడం శుభపరిణామం. బీసీ సబ్‌ప్లాన్ నిధులను వైసీపీ దుర్వినియోగం చేస్తే తమ ప్రభుత్వం రాగానే ఏడాదికి రూ. 30 వేల కోట్ల చొప్పున సబ్ ప్లాన్ నిధులు విడుదల చేస్తామని ప్రకటించడం అభినందనీయం.

-వలవల బాబ్జి,టీడీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి

పింఛన్ ప్రకటన అద్భుతం



బీసీ డిక్లరేషన్ అద్భుతంగా ఉంది. ప్రధానంగా బీసీల్లో అనేక చేతివృత్తుల వారు ఉంటారు. వారందరికీ 50 ఏళ్లకే పింఛన్ వర్తింపజేయడం మంచి నిర్ణయం. 50 ఏళ్ల వచ్చిన వారికి ఆరోగ్య సమస్యలు వచ్చి ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారికి పింఛన్ అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, శెట్టి బలిజ సేవా సంఘం అధ్యక్షుడు



11 నుంచి పెద్దింట్లమ్మ జాతర

కైకలూరు, మార్చి 6: కొల్లేటికోట పెద్దింట్లమ్మవారి జాతరకు భారీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు 15 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు భక్తుల దర్శనార్థమై భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పాలపొంగళ్లను పొంగించుకునేందుకు, విశ్రాంతి తీసుకునేందుకు ఆలయం చుట్టూ చలువ పందిళ్లను ఏర్పాటు చేసి పలు తోరణాలతో డెకరేషన్ చేస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఉచిత, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ ఈవో కేవీ గోపాలరావు తలిపారు.


అటవీశాఖ అధికారులతో కొల్లేరు నాయకుల వాగ్వాదం

కొల్లేరులో ఉద్రిక్తత

ఏలూరు రూరల్, మార్చి 6: కొల్లేరు ఆపరేషన్ తరువాత మళ్లీ నెమ్మ దిగా మొదలైన చెరువుల ఆక్రమణలో ఇటీవల కొన్నేళ్లుగా విశ్వరూపం దాల్చుతున్నాయి. అభయారణ్యం ఇప్పుడు ఆక్రమణకు నెలవుగా మారుతోంది. కొల్లేరులో కొంతమంది అక్రమంగా చెరువుల తవ్వకానికి ఒడిగడుతున్నారు. ఏలూరు రూరల్ మండలంలోని పైడిచింత పాడు గ్రామంలో కొల్లేరు అభయారణ్య పరిధిలోని సుమారు 102 ఎకరాల అటవీ భూమిని చేపలచెరువుగా మారుస్తున్నారన్న ఫిర్యాదు మేరకు 30 మంది అటవీశాఖ సిబ్బంది బుధవారం పైడిచింతపాడు గ్రామం చేరు కున్నారు. చెరువులకు నీరు నింపే పనిని నిలుపుదల చేస్తుండగా కొల్లేరు నాయకులు, పలువురు గ్రామస్థులు అటవీశాఖ సిబ్బందిని అడ్డుకున్నారు. వాగ్వివాదానికి దిగారు. తమ విధులకు ఆటంకం పరిచారని వన్యప్రాణ విభాగం వీఎఫ్‌వో హిమశైలజ తెలిపారు. ఇటీవల పైడిచింతపాడులో అక్రమంగా చేపల చెరువు తవ్వుతున్నారనే సమాచారం కలెక్టర్ దృష్టికి వెళ్ళడంతో అక్రమ చేపల చెరువుల కార్యకలాపాలను ఆపివేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఉదయం అటవీ, పోలీస్ సిబ్బంది ఆ చెరువువద్దకు వెళ్లి తక్షణం ఖాళీ చేయాలని తెలపడంతో అక్కడే ఉన్న కొల్లేరు నాయకులు, గ్రామస్థులు అటవీశాఖ సిబ్బందిని అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. డివిజనల్ అటవీశాఖ, వన్యప్రాణి యాజమాన్య విభాగం ఉత్తర్వుల మేరకు 120 జీవోను అనుసరించి చేపలవేట చేసుకునే హక్కు ఉందని, అలా చేసుకుంటూ కొల్లేరుకు పూర్వ వైభవం తీసుకురావడానికి సహకరించాలని వారికి విజ్ఞప్తి చేశారు.

ఆ..పట్టాలు రద్దు చేయాలి

సామూహిక స్థలంలో పట్టాలెలా ఇస్తారు ?



కాలనీ వాసుల అవసరాలు తీర్చేందుకు లేఔట్‌లో ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ అధికారులు కేటాయించారు. అయితే అధికార పార్టీ వైసీపీ నాయకుల కళ్ళు ఆ స్థలంపై పడ్డాయి. 19 పట్టాలను సృష్టించి లబ్ధిదారులకు కేటాయించి సరిహద్దు రాళ్లు వేశారు. ఆ పట్టాలు రద్దు చేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

-వాసంశెట్టి నాగమణి, కాలనీ నివాసి

ప్రజా అవసరాలకు స్థలం ఎలా వస్తుంది



కాలనీవాసులు అవసరాలు తీర్చేందుకు ఉంచిన స్థలాన్ని ఇళ్ల స్థలాలకు ఇచ్చేస్తే అవసరాలు ఎలా తీరుతాయి. భవిష్యత్తులో పెళ్లిళ్లు చేసుకోవాలన్న, సమావేశాలు నిర్వహించుకోవాలన్నా స్థలం ఎలా వస్తుంది. మా స్థలం మాకే కావాలి. ఇళ్ల స్థలాలు ఇస్తే ఊరుకోం. పట్టాలిచ్చిన తహసీల్దార్‌పై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తాం.

-దమ్ము వరలక్ష్మి ,కాలనీ నివాసి, బ్రాహ్మణ చెరువు

బ్రాహ్మణ చెరువు కాలనీవాసులు తహసీల్దార్‌కు ఫిర్యాదు

పెనుమంట్ర, మార్చి 6 : పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులో 2019లో ఆరు ఎకరాల లేఅవుట్‌లో 224 మందికి అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కాలనీ మధ్యలో కాలనీ వాసుల అవసరాలకు సామూహిక భూమిని వదిలి పెట్టారు. ఐదేళ్ల తర్వాత అధికార పార్టీ నాయకులు 19 పట్టాలను సృష్టించారు. ఎమ్మెల్యే రంగనాథరాజు ఆశీస్సులతో వాటిని అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి స్పందనలో ఫిర్యాదు చేశారు. పట్టాలు ఇచ్చినచోట రాళ్ల పాతడంతో మహిళలు ఆగ్రహంతో రాళ్లను తొలగించారు. ఈ స్థలంలో కాలనీ వాసుల అవసరాలకు ఉపయోగించాలే తప్ప ఇళ్ల పట్టాలు ఇవ్వడమేమిటంటూ కాలనీ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టాలను తక్షణమే రద్దు చేయాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


స్థలం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ఒక్కో ఆలయం.. ఒక్కో చరిత్ర

శివరాత్రికి ముస్తాబు.. ఓసారి వెళ్లొద్దాం



కోనేరులో పరుశురాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి

త్రిలింగ క్షేత్రం.. నత్తా రామేశ్వరం

పెనుమంట్ర, మార్చి 6: నత్తా రామేశ్వరం త్రిలింగ క్షేత్రంగా ప్రాచుర్యం పొందింది. సీతారామచంద్రులు అయోధ్యకు వెళుతూ మార్గమధ్యలో గోస్తనీ నదిలో పరశురాముడు ప్రతిష్ఠించిన సప్త కోటి లింగం శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. గట్టుపైన శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు హనుమంతుని శివలింగం తీసుకురావాలని ఆజ్ఞాపించారు. ముహూర్త సమయం దగ్గర పడటంతో గోస్తనీ నదిలో ఇసుక, నత్తగుల్లలు. వండ్రు మట్టి మిశ్రమాన్ని శివలింగంగా చేసి ప్రతిష్ఠించడంతో గ్రామానికి నత్త రామేశ్వరం అని పేరు వచ్చింది. రామేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, గోస్తనీ నది అవతలి వైపున లక్ష్మణేశ్వరస్వామి అనే మూడు శివ లింగాలు ఒకేచోట ఉండుటచే త్రిలింగ క్షేత్రంగా పిలవబడుతుంది. ఎనిమిదో తేదీ శివరాత్రి పురస్కరించుకుని రథోత్సవంపై పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహిస్తారు.

శ్రీఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి



జుత్తిగలో శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి క్షేత్రం గురించి వాయు పురాణంలోని గోస్తాని నదీ మహత్యం పూర్వం ధూతి కాపురం నేడు జుత్తిగగా పిలవబడుతుంది. త్రేతాయుగంలోని దుష్టుడైన రావణాసురుడిని వాసుకి అనే రాజు రవి అనే సూర్యుడిని సోము అనే చంద్రుడిని పరాభవించి నాడు రావణుడు పరివారమైన భయంకర రాక్షసులను దేవతలను పీడింప సాగిరి. రవి, సోములు వాసుకి గోస్తానీ నది తీరంలో లింగాన్ని ప్రతిష్ఠించి పూజించారు ఈ లింగానికి వాసుకి రవి సోమేశ్వర స్వామిగా పేరు వచ్చింది.

ఇదీ ఆచంటేశ్వరుని చరిత్ర



ఆచంట, మార్చి 6 : ఏటా ఐదు రోజులు మహాశివరాత్రి మహోత్సవాలు ఆచంటేశ్వరుని ఆలయంలో జరుగుతాయి. భారతావనిలో ప్రసిద్ధ ఆలయాలలో ఆచంటేశ్వర క్షేత్రం ఒకటి. గోదావరి తీరానికి కొంత దూరంలో పూర్వపు మార్తాండ పురమే ఆచంటగా పేరుగాంచింది. పూర్వం తారకాసుర సంహారం తరువాత శివ పార్వతులు కేళీ విలాస సమయంలో ముని దంపతులు శివసాన్నిధ్యం కోరి కైలాసమేగగా పరీక్షముగా తిలకించుట శివుడు గమనించి ఆ దంపతులను బాల బాలికలను చేసి, బ్రహ్మచర్యము ఆచరించిన శివ సాన్నిధ్యం పొందుతారని ఆజ్ఞాపించెను. శివుని ఆజ్ఞ పాటించనందున శాపగ్రస్తులై తిరువల్లూరు లో బ్రాహ్మణుని పుష్పసుందరుడు ఒడయనంబిగా, మార్తాండపురలో కళావంతుల ఇంట పుష్ప సుందరి పరమనాచిగా జన్మించారు. మహా శివరాత్రి రోజున ఆ దంపతులు సుఖ నిద్రకు లోనై పూజలకు సమయం మించిపోయినందున భక్తుడైన ఒడయనంబి, పరమనాచి యొక్క స్థనాగ్రభాగమున ప్రత్యక్షముగా కనిపించగా శంకరుడు ఆ దంపతులకు శివ సాన్నిధ్యం చేకూర్చెను. స్వామి స్థనాగ్రభాగమున వెలసి నం దున మార్తాండపురము ఆచంటేశ్వరుడిగా విరాజిల్లుతున్నది.

దక్షిణ కాశి.. శ్రీ మేధా దక్షిణామూర్తి



దెందులూరు, మార్చి 6 : స్వయంభుగా వెలసినట్టు పేరు పొందిన శివాలయాల్లో అతిపురాతన మైనది దక్షిణ కాశీగా చల్ల చింతలపూడిలో శివాలయం. 800 సంవత్సరాల క్రితం వేంగీ రాజులు నిర్మించారని స్వయంభుగా శివుడు ఇక్కడ పాదం మోపాడని పురాణ కథనం. ఇక్కడ పంచాయత క్షేత్రంగా శ్రీ మేధా దక్షిణామూర్తి ఉండేవాడని పెద్దలు చెబుతున్నారు. ఈ చల్లచింతలపూడిలో రైతులు, పశుపోషణతో జీవనం సాగించే వారని, దీంతో పెరుగు, పాలు పుష్కలంగా ఉండటంతో తెల్లవారుజాము నుంచి గ్రామంలో మజ్జిగ(చల్ల) చేయడం ప్రారంభించేవారని ఆ శబ్దాన్ని భరించలేని శివుడు కృష్ణా, పశ్చి మ జిల్లాలోని విజయరాయి సరిహద్దులోని బలివేలో బలివే రామస్వామిగా వెళ్లారని చెబుతారు. శివుడు వెళ్లే సమ యంలో శివాలయ మండపం పడిపోతుండగా భక్తులు శివుడి ని వేడుకోగా పడిపోతున్న శివాలయ మండపాన్ని ఆగిపోమ ని ఆజ్ఞాపించడంతో సగం పడిన మండపం నిలిచిపోయిందని పెద్దలు చెబుతున్నారు.

ఆలయ స్థల పురాణం

త్రేతాయుగములో లింగ ప్రతిష్ఠ జరిగినట్లు చరిత్ర చెబుతోంది. శ్రీరాముడు రావణ సంహరణం అనంతరం బ్రహ్మ హత్య దోష నివారణకు అనేకచోట్ల ఈశ్వర లింగ ప్రతిష్ఠ చేసుకుంటూ అయోధ్య చేరడానికి ముందు మహా అరణ్యమైన స్థలంలో ప్రతిష్ఠ చేసినట్లు ప్రసిద్ధి. బలిచక్రవర్తి పరిపాలించడంతో బలివే పేరుపై బలివే రామస్వామిగా పిలుస్తున్నారు.

శివదేవ స్వామికి ఉత్సవాలు



పాలకొల్లు రూరల్, మార్చి, 6: వాయు త్రిలింగ క్షేత్రాల్లో శివదేవుని చిక్కాలలో శివదేవ స్వామి క్షేత్రం ఒకటి. శ్రీఆంజనేయ స్వామి ప్రతిష్ఠించిన శివదేవస్వామి ఆలయం ప్రసిద్ధి గాంచింది. శివర్రాతి రోజున సంతానం కోసం స్వామికి అభిషేకం చేసి, ఆలయ ప్రాంగణంలో కొబ్బరి సుధ మొక్కలు నాటితే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

రేపు మహా సుదర్శన నృశింహ యజ్ఞం



దేవతామూర్తుల విగ్రహాలు

ద్వారకా తిరుమల, మార్చి 6: సుందరగిరిపై స్వయంభుమూర్తిగా కొలువైన శ్రీలక్ష్మీనరసింహుని ఆలయంలో మహా శివరాత్రి పురస్కరించుకుని శ్రీమహా సుదర్శన నృశింహ యజ్ఞానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ వాసి కొచ్చర్లకోట నరసింహ గురూజీ ఆధ్వర్యంలో సీహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అభిషేకానికి 1008 కలశాలను సిద్ధం చేశారు.

నేత్రపర్వం...ధ్వజారోహణ.

శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల దివ్యకల్యాణ మహోత్సవాల్ను క్షేత్రపాలకుని ఆలయంలో జరుగుతున్నాయి. వేదపారాయణలు, శివదేవునికి అభిషేకాలు నిర్వహించారు.

ఆచంటేశ్వరుడి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఆచంట, మార్చి 6 : ఆచంటేశ్వరుని మహాశివ రాత్రి కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి, దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ విద్యాసాగర్, కమిటీ సభ్యులు ఆలయ అధికారి రాము, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులు జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. బుధవారం ఎస్పీ ఆచంట వచ్చి ఉత్సవ ఏర్పాట్లపై ఈవో రాముని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ, ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం

భీమవరం టౌన్, మార్చి 6: పంచారామ క్షేత్రంలో మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సోమేశ్వర జనార్దన స్వామివారి ఆలయంలో శివరాత్రి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకారం చేశారు. ధ్వజారోహణ నిర్వహించారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



పాలకొల్లు టౌన్, మార్చి, 6: పంచారామ క్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లు శ్రీ క్షీరారామలిం గేశ్వర స్వామి దేవస్థానం శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబవుతోంది. రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలలో శిరోభాగం పూజలు క్షీరారామలింగేశ్వరస్వామి అందుకుంటున్నారు. పాలకొల్లు పట్టణంలో 13వ శతాబ్ధంలో చోళులు 9 అంతస్తులుగా 125 అడుగుల ప్రాకారంతో నిర్మించిన గోపురం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. శివలింగమును శ్రీరామచంద్ర మూర్తి ప్రాణ ప్రతిష్ఠ చేయగా విష్ణుమూర్తి క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్నారు.

18 జడ్పీ హైస్కూళ్లు.. జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6 : హైస్కూల్, ఇంటర్ విద్యను(10+2) ఒకేచోట అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లాలో కొత్తగా 18 జడ్పీ జూనియర్ కళాశాలల (హైస్కూల్ ప్లస్)ను ప్రస్తుత హైస్కూళ్లనే అప్‌గ్రేడ్ చేయడంతో 2024-25 విద్యా సంవత్సరం జూన్ ఒకటి నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైస్కూల్ ప్లస్‌లకు ఇవి అదనం. జడ్పీ జూనియర్ కళాశాలలను కో-ఎడ్యుకేషన్ విధానంలో ఏర్పాటు చేస్తారు. కొత్త కళాశాలల ఏర్పాటుకు డీఈవో, ఆర్జేడీలు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రస్తుత కళాశాలలకే విద్యార్థుల కొరత

ప్రతీ మండలానికి ప్రభుత్వ యాజమాన్యంలో బాలికలకోసం ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో రెండేళ్ల క్రితం జిల్లా మొత్తం 24 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారు. బోధనా సిబ్బంది నియామకాలు, పాఠ్యపుస్తకాలు, ల్యాబ్‌లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం గత విద్యా సంవత్సరం పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉంది. ఈ లోపాలతో కొత్తగా ఏర్పాటైన 24 జడ్పీ జూనియర్ కళాశాలల్లో చింతలపూడి, చాట్రాయి, గుణ్ణంపల్లి, కానుకొలను, గురజ కళాశాలల్లో ఒక్కరూ లేకుండానే కేవలం రికార్డుల్లో కొనసాగుతున్నాయి. జడ్పీ జూనియర్ కళా శాలల్లో (హైస్కూల్ ప్లస్) ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కేవలం 302 మంది మాత్రమే. పూర్తి స్థాయిలో బోధనా సిబ్బందిని నియమించినా జడ్పీ జూనియర్ కళాశాలల ఏర్పాటు ప్రయోగం విఫలమైనట్టేనని విమర్శలు లేకపోలేదు.

ఉమ్మడి జిల్లాలో కొత్త కళాశాలలు

ఏలూరు జిల్లాలో పూళ్ళ, చిన్నంపేట, కొవ్వలి, పంగిడిగూడెం, రావికంపాడు, చెక్కపల్లి, పెదనిండ్రకొలను, పెదవేగి, బొర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లు, పశ్చిమ గోదావరిలో రేలంగి, కోపల్లి, ముత్యాలపల్లి, ఎల్.బి.చర్ల, శృంగవృక్షం, దేవ, మార్టేరు, పోడూరు, వీరవాసరం జడ్పీ హైస్కూళ్లు ఎంపికయ్యాయి.

కేజీ పొగాకు ధర రూ.240

- ఆశాజనకంగా ఉందంటూ రైతుల ఆనందం
- 5 వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం



జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు ప్రారంభిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం, మార్చి 6:ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో రెండు, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లిలో ఒక్కొక్క కేంద్రం చొప్పున మొత్తం ఐదు పొగాకు వేలం కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైంది. ప్రారంభ ధర కేజీకి గరిష్టంగా రూ. 240 పలకడంతో రైతాంగం ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం లోనే మిచాంగ్ తుఫాన్ దెబ్బకు తోటలన్నీ సర్వనాశనం అయ్యాయి.

ఉమ్మడి పశ్చిమలో బుధవారం నుంచి ఎన్ఎల్ ఎస్ పరిధిలో గల ఐదు వర్జీనియా వేలం కేంద్రాల్లో వేలం ప్రక్రియలో భాగంగా ప్రారంభ ధర ఆశాజనకంగా ఉందని రైతులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రారంభంలో ధర సంతృప్తి కరంగా ఉండటంతో రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. సరాసరి ధర అధికంగా ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. ఈ సీజన్‌లో తుఫాను తాకిడికి తీవ్రంగా వర్జీనియా రైతు నష్టపోయాడని, దానిని దృష్టిలో పెట్టుకుని సరాసరి ధర మంచి ధర ఇప్పించాలని కోరారు. ఇదిలా ఉంటే అధికంగా పండిన పంటకు అపరాధ రుసుము లేకుండా పొగాకును కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా ఉమ్మడి పశ్చిమలో ఐదు వేలం కేంద్రాల్లో ప్రారంభ ధర కేజీ ఒక్కింటికి రూ.240 లభించింది. జంగారెడ్డిగూడెం 1వ వేలం కేంద్రంలో 27బేళ్లు, 2వ వేలం కేంద్రంలో 99బేళ్లు, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం వేలం కేంద్రాలకు 27 బేళ్లు వంతున రైతులు వేలం కేంద్రానికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమ ంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలం కేంద్రం అధికారులు శ్రీహరి, సురేంద్ర, రైతు నాయకులు కరాటం రెడ్డిబాబు, ఘంటశాల గాంధీ, రాంబాబు, వామిశెట్టి హరిబాబు, గద్దే లక్ష్మణరావు, గడ్డమణుకు దత్తుడు, గద్దే ప్రసాద్, సత్రంవెంకట్రావు, వీవీఎస్ ప్రకాశరావు, విన్నమనేని రాధాకృష్ణ, అట్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేలం

ఈ ఏడాది వర్జీనియా వేలం ప్రక్రియ ఆశాజనకంగా ఉంటుందని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని వర్జీనియా వేలం కేంద్రం 1, 2లో వేలం ప్రక్రియ బుధవారం ప్రారంభంలో పాల్గొన్న ఈడీ అద్దంకి శ్రీధర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైందన్నారు. ఎన్ఎల్ఎస్ ఏరియా పరిధిలో గత ఏడాది వర్జీనియా రైతులకు ఎంతో ఆనందాన్ని మిగిల్చిందన్నారు. గరిష్ట ధరలు నమోదు చేస్తూ రైతులకు ఉత్సాహ పరిచిందన్నారు. గత ఏడాది గోదావరి జిల్లాల్లో ఎన్ఎల్ఎస్ పరిధిలో 57.90మిలియన్ కేజీల పొగాకు పంట పండగా, మంచి ధరలకు వేలం నిర్వహించారన్నారు. గరిష్ట ధర రూ.288 పలుకగా, సరాసరి ధర రూ.245.81 లభించిందన్నారు. ఇదే ఉత్సాహంతో రైతులు ఈ ఏడాది వర్జీనియాను సాగు చేశారన్నారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో ప్రస్తుత సీజన్‌లో 66.65 మిలియన్ కేజీల పంట పండి ఉంటుందని శ్రీధర్ అంచనా వేశారు. ప్రస్తుతం మన పొగాకుకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులు సైతం నాణ్యమైన పొగాకు అందిస్తుండటంతో ఆశాజనకమైన మార్కెట్ లభిస్తోందన్నారు. గతంతో పోల్చితే విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుడటం శుభపరిణామం అన్నారు. మిచాంగ్ తుఫాను రైతులను ఇబ్బందులకు గురి చేసినప్పటికీ ఎంతో ఓర్పుతో రైతులు మంచి పంటను అందివ్వగలిగారన్నారు. ఈ సందర్భంగా రైతులు నిల్ సెస్ గురించి అడగగా స్పందించిన శ్రీదర్ బాబు సెస్ విధింపు లేదా రద్దు అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం అన్నారు. రైతులు తనకు తెలియజేసిన దానిని ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు.



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు, బన్ని వాసు తదితరులు

ఉత్తమ ప్రదర్శనగా రాత నాటిక

పాలకొల్లు టౌన్, మార్చి 6 : పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో అద్దేపల్లి వారి సత్రంలో మూడు రోజులు పాటు నిర్వహించిన జాతీయస్థాయి నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు, థియేటర్ ఆర్ట్స్ వెలగలేరు వారి రాత నాటిక ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక ద్వితీయ బహుమతి పొందింది. కరీంనగర్‌కు చెందిన స్వప్నం రాల్చిన అమృతం నాటిక తృతీయ బహుమతి పొందింది. కళాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాలకొల్లులో గత టీడీపీ హయాంలో 70 శాతం పనులు పూర్తిచేసిన బొండాడ వెంకటరాజు గుప్త, ఎన్టీఆర్ కళా క్షేత్రాన్ని అన్ని సౌకర్యాలతో అద్భుతంగా పూర్తిచేసి 2025లో రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలను నిర్వహించేలా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. బన్ని వాసు, కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు, డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, విఠాకుల రమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాపుల డిక్లరేషన్ ఎపుడు : జోగయ్య

పాలకొల్లు, మార్చి 6 : జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు జయహో బీసీ అంటూ పది హామీలతో కూడిన బీసీ డిక్లరేషన్స్ చంద్రబాబు, పవన్‌లు మంగళగిరిలో ప్రకటించారు. చాలా సంతోషం. 52 శాతం ఉన్న వెనుకబడిన జాతులకు డిక్లరేషన్ ప్రకటించడం ఆహ్వానించదగ్గదే. మరి కాపులకు డిక్ల రేషన్ ఎపుడు ప్రకటిస్తారని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామ జోగయ్య ప్రశ్నించారు. పవన్ బీసీలకు పెద్ద పీట వేస్తూ డిక్లరేషన్ ద్వారా 10 ఎన్నికల హామీలు ఇస్తూ ప్రకటన చేశా రని, కాపులకు డిక్లరేషన్ ప్రకటించాలని జోగయ్య సూచించారు. 25 శాతం ఉన్న కాపు కులస్థులకు టీడీపీ, జనసేన తన ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీలకు సమానంగా సౌకర్యాలు కలగజేస్తూ హామీలు ఇవ్వాల్సి ఉందన్నారు.

20 మందికి కుక్కకాటు

నరసాపురం, మార్చి 6: పట్టణంలో బుధవారం పిచ్చికుక్క స్వైర్య విహారం చేసింది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మల్లవరం వరకు 20 మందిని గాయపర్చింది. బస్టాండ్ వద్ద వృద్ధుడ్ని గాయపర్చింది. భయభ్రాంతులైన ప్రజలు దానిని కొట్టే ప్రయత్నం చేశారు. గాంధీనగర్, పంజాసెంటర్, పీచుపాలెం, అక్కడ నుంచి మళ్లీ చినమామిడిపల్లి, సరిపల్లిలో రహదారిపై వెళుతున్న వారిని గాయపరిచింది. క్షేతగ్రాతులు ప్రభుత్వ అస్పత్రికి వెళ్లారు. వైద్యులు చికిత్స చేసి వ్యాక్సిన్‌లు వేశారు. వెంటనే అస్పత్రి సూపరిడెండ్‌ంట్ సుప్రీయ విషయాన్ని కమిషనర్ వెంకటేశ్వరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ శానిటరీ సిబ్బందిని కుక్కను పట్టుకోమని ఆదేశించారు. సిబ్బంది మూడు బృందాలుగా గాలించినా కుక్క ఆచూకి చిక్కలేదు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 6 : అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. కొమడవోలుకు చెందిన మంచినీళ్ళ శివదుర్గ (35)కు భర్త నాగరాజు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంత కాలం నుంచి ఫిట్స్ వ్యాధితో శివదుర్గ బాధపడుతుంది. ఎన్ని మందులు వాడినా ఫిట్స్ తగ్గకపోవడంతో ఈనెల 5న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కుటుంబ సభ్యులు వచ్చేటప్పటికి ఆమె మృతి చెందింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు.


కష్టానికి గుర్తింపే మహిళా దినోత్సవం



మహిళా ఎస్ఐను సన్మానిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 6 : మహిళల కష్టానికి గుర్తింపుగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకమని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా మహిళా పోలీస్ సిబ్బందితో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులు, మహిళా అధికారులు, సిబ్బందిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఎస్పీ మేరీ ప్రశాంతి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఒక కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకు వచ్చిందని ఎంతో మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు చేశారన్నారు. తమ హక్కుల కోసం చేసిన పోరాటాల ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం 1908లో న్యూయార్కు సిటీకి చెందిన 15 వేల మంది మహిళలు తమకు పని గంటలను తగ్గించాలని, పురుషులతో సమానమైన జీతాన్ని ఇవ్వాలని, ఓటు వేసే హక్కును కల్పించాలని ప్రదర్శన నిర్వహించారన్నారు. తొలిసారిగా 1911లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారన్నారు. ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్, అమెరికా ఇలా పలు దేశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రారంభమైందన్నారు. 1975లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా ఐక్యరాజ్య సమితి ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ స్వరూపరాణి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



జడ్పీ డిప్యూటీ సీఈవోను సత్కరిస్తున్న జేపీసీ నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 6 : ఏపీ జేఏసీ-అమరావతి జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవా రం రెవెన్యూ భవన్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్, రెవెన్యూ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యశాఖ, పౌర సరఫరాల శాఖ ప్రభుత్వ విభాగాల ఉద్యోగినులు హాజరయ్యారు. జడ్పీ డిప్యూటీ సీఈవో నిర్మలజ్యోతి మాట్లాడుతూ మహిళా స్వేచ్ఛ, సాధికారత గురించి వివరించారు. విధి నిర్వహణలో విజయవంతంగా రాణించాలని సూచించారు. ఏపీజేఏసీ-అమరావతి జిల్లా కార్యదర్శి ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోను పురుషులతో సమానంగా మహిళా ఉద్యోగులు ఉన్నత స్థాయిలో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఇటీవల మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటలు, పాటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, మెడికల్ ఆఫీసర్ ఉదయబాను, జేపీసీ మహిళా విభాగం ఛైర్‌పర్సన్ ఆర్.వి.బి.టి.సుందరి, కో-ఛైర్‌పర్సన్ యు.యామిని, సెక్రటరీ జనరల్ బి.గీతిక, అసోసియేట్ ఛైర్‌పర్సన్ శాంతకుమారి, స్టేట్ సెక్రటరీ జి.జ్యోతి, కోశాధికారి భవ్రి, కార్యదర్శి రూస్సీలక్ష్మీబాయ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై అకృత్యాలు

ఎనిమిదేళ్ల సోదరుడి కుమార్తెతో పెదనాన్న అసభ్యకర ప్రవర్తన

ఏలూరు క్రైం, మార్చి 6 : ఏలూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పలువురి చిన్నారులపై అత్యాచారయత్నాలు జరిగాయి. ఎనిమిదేళ్ల చిన్నారిపై ఆమె పెదనాన్న అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఏలూరు దిశ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. నగరంలోని ఓ ప్రాంతానికి చెందిన ఒక మహిళలకు ఇద్దరు కుమార్తెలు. ఆమె భర్త దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ఏ పనికి వెళ్ళకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆ మహిళ అక్క ఇల్లు సమీపంలో ఉండడంతో ఆమె ఇద్దరు పిల్లలు తరచూ అక్కడ వెళ్లి అక్కకు వున్న ముగ్గురు పిల్లలతో కలిసి ఆటపాటలతో ఆనందంగా నడుపుతున్నారు. గత ఏడాది డిసెంబర్ 23న క్రిస్మస్ సెలవులు నిమిత్తం ఆ ఇద్దరు చిన్నారులు పెద్దమ్మ ఇంటికి వెళ్ళారు. వేకువజామునే పిల్లలంతా లేచి చలిమంటలు కాగుతుండగా ఎనిమిదేళ్ల చిన్నారి మాత్రం ఇంటి హాలులో ఒంటరిగా పడుకుంది. ఆ సమయంలో అక్కడే వున్న ఆ చిన్నారికి పెదనాన్న వరుసయ్యే వ్యక్తి నిద్రపోతున్న బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటనపై బాలిక తల్లి అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటే ఆమె అక్క కాళ్లావేళ్లా పడి విషయాన్ని మరుగున పెట్టేశారు. విషయం ఆలస్యంగా ఆ బాలిక బంధువులకు తెలియడంతో వారు వచ్చి ఈ నెల 5న గొడవ చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఏలూరు దిశ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయడంతో సీఐ విశ్వం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

దివ్యాంగ బాలికకు జామ పండు ఇస్తానని నమ్మబలికి ఓ వృద్ధుడు పట్టపగలు ఇంటి పక్కకు తీసుకువెళ్ళి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. అటు వెళ్తన్న ఇద్దరు చూసేటప్పటికి ఆ వృద్ధుడు పారిపోయాడు. బాలిక ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి బుధవారం కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన ఒక దివ్యాంగబాలిక (14) బుధవారం మధ్యాహ్నం బయటకు వెళుతుండగా అక్కడే ఉన్న పెద్దింటి కనకారావు అనే వృద్ధుడు(70) జామపండు ఇస్తానని ఇంటి పక్కకు పిలిచి అత్యాచారానికి వడిగట్టాడు. అటు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు చూడడంతో కనకారావు పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు తన కుటుంబసభ్యులతో వచ్చి ఏలూరు రూరల్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై ఇంటర్ విద్యార్థుల అత్యాచారం

చాట్రాయి, మార్చి 6 : చాట్రాయిలో మానసిక దివ్యాంగురాలైన యువతి(21)పై ఇద్దరు ఇంటర్ విద్యార్థులు అత్యాచారం చేసినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ కేసీ హెచ్ స్వామి కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం తండ్రి తొమ్మిదేళ్ల క్రితం చనిపోగా, తల్లి నిత్యం కూలి పనులకు వెళుతుండటంతో బాధితురాలు ఒంటరిగా ఇంటి దగ్గర ఉంటున్నది. మంగళవారం తల్లి ఇంటికి వచ్చిన సమయంలో నిందితులు కుమార్తెపై అసభ్యంగా ప్రవర్తిస్తుండగా కేకలు వేయడంతో పారిపోయారని బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, మార్చి 6: ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. సైబర్ క్రైమ్ నివారణ కోసం ప్రజలను అప్రమత్తం చేయడానికి తయారుచేసిన గోడ పత్రికను ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఐజీ ఆవిష్కరించి మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాలని నమ్మబలికి డబ్బులను వసూలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులు, గృహిణులు ఇంటి వద్ద ఉంటూ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ అదనపు ఆదాయం సంపాదించవచ్చు అంటూ వస్తున్న ప్రకటనలను చూసి మోసపోవద్దన్నారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు వస్తాయని వేలల్లో పెట్టుబడి పెడితే లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాటప్స్, టెలిగ్రామ్ ప్రకటనలు నమ్మకూడదని సూచించారు. లాటరీ వచ్చిందని వచ్చే కాల్స్, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ప్రజలు సైబర్ నేరాలకు గురైతే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ఏలూరు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బిహెచ్ వెంకటేశ్వర్లు, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కాగితపు శ్రీనివాసరావు, సైబర్‌సెల్ ఎస్ఐ మధురాజు పాల్గొన్నారు.



పోలీస్ జాగిలం డాన్ మృతి

ఏలూరు క్రైం, మార్చి 6 : పోలీస్ శాఖలో 12 సంవత్సరాల పాటు సేవలందిస్తూ కీలకమైన కేసులను చేదించిన పోలీస్ జాగి లం డాన్ అనారోగ్యంతో బుధవా రం ఉదయం మృతి చెందింది. 2013 జూలై 1న జన్మించిన డాన్ జిల్లా పోలీస్ శాఖలో చేరింది. 2018లో శిక్షణ పొందిన డాన్ శిక్షణలోనే గోల్డ్‌మెడల్ సాధించింది. డాన్ జాగిలం హ్యాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షరీఫ్ వ్యవహరిస్తున్నారు. ఈ జాగిలం చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో జరిగిన జంట హత్యకేసులను ఛేదించింది. ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక హత్య కేసును ఛేదించింది. పోలీస్ జాగిలం మృతదేహంపై ఎస్పీ మేరీ ప్రశాంతి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ స్వరూపరాణి, ఎఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఎఆర్ఆర్ఐ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాల కేసులో వైసీపీ నేతల ఒత్తిళ్లు

పెనుమంట్ర, మార్చి 6 : భట్లమగుటూరు వీఆర్వో నాగేశ్వరి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆరు సెంట్ల స్థలాన్ని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఈదా అనిత భర్త ప్రవీణ్ తప్పుడు సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్న ఘటనపై కేసు కట్టకుండా ప్రజా ప్రతినిధులు పోలీసులపై ఒత్తిడి చెయ్యటం దారుణమని, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీందరరాజు అన్నారు. పార్టీ నాయకుడు ఫోర్జరీ సంతకాలు చేసినట్లు స్పష్టంగా కనబడుతున్నా నిందితులను కాపాడేందుకు వైసీపీ నేతలు అడ్డుపడటం దారుణమన్నారు. ఫిర్యాదు చేసిన ఉద్యోగిని నాగేశ్వరిపై కొందరు నేతలు రూ.లక్షా 50 వేలు లంచం అడిగారని ఇవ్వనందుకే ఫిర్యాదు చేశారని ప్రచారం చేయటం శోచనీయమన్నారు. ఫోర్జరీ సంతకం చేసిన వారిపై కేసు నమోదు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

పాస్టర్ల సమావేశం రసాభాస

టోకెన్లు ఇచ్చి నగదు ఇవ్వలేదంటూ ఆరోపణ



నిర్వాహకులు, పాస్టర్లతో మాట్లాడుతున్న పోలీసులు

ఏలూరు టూ టౌన్/పెదపాడు, మార్చి 6 : ఏలూరు జిల్లావ్యాప్తంగా వున్న పాస్టర్లకు పాస్టర్స్ కాన్ఫరెన్స్ పేరిట పెదపాడు మండలం వట్లూరు క్రాంతి కళ్యాణవేదిక వద్ద నిర్వహించిన సమావేశం బుధవారం రసాభాసగా మారింది. ప్రసంగికుల దైవ సందేశం అందించారు. ఉదయం 11 గంటలలోపు వచ్చి పేరు నమోదు చేయించుకున్న వారికి ప్రత్యేక బహుమతితోపాటు ప్రేమవిందు కలదని స్థానిక పాస్టర్లు, నాయకుల పేరుతో కరపత్రాలను ముద్రించారు. ప్రత్యేక బహుమతితోపాటు వెయ్యి రూపాయలు ఇస్తామనడంతో మూడు వేల మంది వరకు పేర్లు నమోదు చేసుకోగా వారికి నిర్వాహకులు టోకెన్లు అందించారు. వక్తల ప్రసంగం ముగిసిన తర్వాత టోకెన్లు తీసుకుని నగదును కొద్ది మందికే ఇచ్చి ఆపివేయడంతో గందరగోళంగా మారింది. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ పలువురు పాస్టర్లు నినాదాలు చేశారు. కొంత మంది నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. కల్యాణ వేదిక ముందు మినీ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ప్రత్యేక బహుమతి అందజేస్తామని పేర్కొనడంతో వ్యయప్రయాసలకోర్చి ఇక్కడకు వచ్చి నిలువు కాళ్ల మీద నిలబడాల్సి వచ్చిందని, టోకెన్లు ఇచ్చిన వారికి నగదు ఇవ్వకుండా నిర్వాహకులు మొహం చాటేశారంటూ పలువురు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు.






కొమరవరంలో ఆరిమిల్లికి జనసైనికుల ఘన స్వాగతం.. వడలిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పితాని.. పెనుమదంలో జనసైనికులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల ప్రచారం.. నరసాపురంలో పార్టీ కిట్‌లు అందిస్తున్న పొత్తూరి, కొవ్వలి నాయుడు

చంద్రబాబు, పవన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

పెనుగొండ, మార్చి 6: వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని మాజీ మంత్రి పితాని సత్య నారాయణ అన్నారు. బుధవారం వడలి గ్రామంలో ప్రజల వద్దకు పితాని ఎన్నికల పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ చంద్రబాబు పవన్ కల్యాణ్‌లకు బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదని బ్యాక్ బోన్ క్లాసెస్ అని నిరూపించేందుకు బీసీ డిక్లరేషన్ ప్రకటించారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలిచేటి బాబూ రాజేంద్ర ప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, వెంగళదాసు దానయ్య, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఉప్పలపాటి చంటి పాల్గొన్నారు. వడలి గ్రామంలో వైసీపీ నుంచి పితాని సమక్షంలో టీడీపీలో చేరారు.

బీసీల ద్రోహి జగన్: ఎమ్మెల్యే నిమ్మల

పోడూరు, మార్చి 6: బీసీల ద్రోహి జగన్ ఓటమి బీసీల చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పెనుమదం బీసీల ఏరియా అప్పిచెర్వులో బుధవారం జనసేన రాష్ట్ర ప్రచార విభాగం కమిటీ ఛైర్మన్ బన్ని వాసు, టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం తపించే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల మీద ప్రజలకు అపార నమ్మకం ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తానేటి బాబూరావు, ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తులా రామలింగేశ్వరావు, జనసేన మండల కన్వీనర్ బోనం చినబాబు పాల్గొన్నారు.

ఆరిమిల్లికి జనసైనికుల ఘన స్వాగతం


తణుకు, మార్చి 6: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సకల జనుల చైతన్య పాదయాత్ర ఉత్సాహంగా సాగుతోంది. ప్రతి గ్రామంలోను టీడీపీ, జనసేన శ్రేణుల కలయికతో గ్రామాల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది. బుధవారం తణుకు మండలం కొమరవరంలో పాదయాత్ర ప్రవేశించినపుడు పవన్ మాటే మా బాట.. పవన్ సూచించిన అభ్యర్థినే గెలిపించుకుంటామని పవన్ అభిమానులు నినాదాలు చేశారు. జనసైనికులు ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అరాచక పాలన అంతమొందిస్తామంటూ ఫ్లెక్సీలలో వివరించారు. ఆరిమిల్లి వెంటే నడుస్తామని జనసైనికులు ప్రతిన బూని ఆయన బాటలోనే పాదయాత్ర చేశారు. సాయంత్రం వీరభద్రపురంలో పర్యటించి రాత్రికి అదే గ్రామంలో పల్లెనిద్ర చేయనున్నారు. టీడీపీ, జనసేన నాయకులు పితాని మోహన్, జుత్తిగ మహేష్, చింతపల్లి సత్యనారాయణ, పితాని గంగాధర్, దొంగ సాయిబాబా, ముత్యాల సత్యనారాయణ, తోట బులిరాజు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేయాలి

నరసాపురం, మార్చి 6: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పొత్తులో భాగంగా టిక్కెట్ ఎవరికి దక్కినా వైసీపీని ఓడించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం నరసాపురం పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజక వర్గస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ ముఖ్య కార్యకర్తలకు టోపి, బ్యాడ్జీ, పార్టీ అదించిన సూపర్ క్యాలెండర్లు, పాకెట్ క్యాలెండర్లు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, బళ్ళ శ్రీను, మూలాస్వామి పాల్గొన్నారు.



బీసీలకు అండ.. టీడీపీ బీసీ డిక్లరేషన్



బీసీ రక్షణ చట్టం బీసీలకు అండగా ఉంటుంది. ప్రస్తుత చట్టాలలో మధ్యతరగతి కుటుంబీకులుగా బీసీలు అధికంగా ఉండడ దంతో కోర్టుల ద్వారా తేల్చుకోలేని ఎన్నో సమస్యలకు మనసు చంపుకుని రాజీపడడం జరుగుతుంది. బీసీలకు 50ఏళ్ళకే పింఛనుతో పాటు రూ.4వేలు అమలు ఆనందంగా ఉంది.

- బొల్లా శేషుబాబు, బీసీ నాయకుడు

అభ్యున్నతికి దోహదం



చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లతోనే బీసీల అభ్యున్నతి అన్నడానికి నిదర్శనం రెండు రోజుల క్రితం గుంటూరులో జరిగిన సభ నిదర్శనం. బీసీలకు వరాలు ప్రకటించారు. బీసీ డిక్లరేషన్‌లో ఉన్న 10 అంశాలు బీసీలకు ఎంతో ఉపయోగపడతాయి.

- గోవిందు, మావుళ్ళదేవస్థానం మాజీ ధర్మకర్త


డిక్లరేషన్ శుభపరిణామం



బీసీలకు భరోసాను కల్పించేలా టీడీపీ - జనసేన అధినేతలు బీసీ డిక్లరేషన్ ప్రకటించడం శుభపరిణామం. బీసీలకు 50 ఏళ్ళకే పెన్షన్ ఇవ్వడం, బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవడానికి కృషి చేస్తున్న చంద్రబాబు వెంటే మేమంతా ఉంటాం.

- బూడి వెంకట పర్రాలు, ఉపసర్పంచ్, కోపల్లె


బీసీలకు తగిన గుర్తింపు



టీడీపీ, జనసేన సంయుక్త జైహో బీసీ డిక్లరేషన్ ఎంతగానో ఆకట్టుకుంది. బీసీలంటే వెనుకబడిన తరగతులు వారు కాదని పార్టీకి వెన్నుముక లాంటి వారని ఇరు పార్టీలు గుర్తించడం చాలా ఆనందంగా ఉంది. బీసీలకు మనోధైర్యం కలిగించే విధంగా ఉంది.

- కామన రాంబాబు, గొల్లలకోడేరు, టీడీపీ నేత

బడుగుల శ్రేయస్సే టీడీపీ లక్ష్యం



బడుగు బలహీనవర్గల శ్రేయస్సే కోసమే టీడీపీ ఏర్పడింది. బీసీల అభ్యున్నతికి పార్టీ కట్టుబడి ఉం దని మరొకసారి వెల్లడైంది. బీసీల అభివృద్ధికి నిధు లు మంజూరు చెయ్యడం టీడీపీతోనే సాధ్యం.

- బచ్చు సరళకుమారి మాజీ సర్పంచ్


50 ఏళ్లకే పింఛన్ హర్షణీయం



విజయవాడలో జరిగిన బీసీ సదస్సులో టీడీపీ, జనసేన కూటమి ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ చాలా బాగుంది. 50 ఏళ్ళకే బీసీలందరికీ పింఛన్ ఇస్తామని ప్రకటించడం అభినందనీయం. ఇటు బీసీలకు చట్టభద్రతతో పాటు సబ్‌ప్లాన్ నిధులు బీసీ సంక్షేమానికి ఖర్చు చేస్తామని చెప్పడం శుభపరినామం.

- ఠాగూర్, అగ్నికులక్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్

టీడీపీ-జనసేనతోనే ప్రగతి



జయహో బీసీ సదస్సులో టీడీపీ-జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ద్వారా మాత్రమే బీసీల ప్రగతి సాధ్యపడుతుంది. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని నిర్ణయించడం హర్షణీయం. ఐదేళ్లలో లక్షన్నర కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయిస్తామని ప్రకటించడం అభినందనీయం

- కడలి విజయ్, బీసీ నాయకుడు, యలమంచిలి

అభివృద్ధి చెందుతారు..



జయహో బీసీ సభలో టీడీపీ, జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ద్వారా రాబోయే రోజుల్లో బీసీలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారు. చట్ట సభ ల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం ద్వారా బీసీలు రాజకీయంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

- శ్రీనివాస్, ఆచంట బీసీ సంఘం అధ్యక్షుడు

అభివృద్ధికి బాటలు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు ప్రోత్సహకాలు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేశారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీలు పార్టీ. బీసీ డిక్లరేషన్‌తో వారి అభివృద్ధి పూర్తిస్థాయిలో జరుగుతుంది.

- కరిమెరక నాగరాజు, ఉండి టీడీపీ అధ్యక్షుడు

శెట్టిబలిజలను దగా చేసిన జగన్

బీసీ డిక్లరేషన్ ఎంతో ఆనందాన్ని కల్గించింది. టీడీపీ బీసీలకు అత్యున్నత స్థానం ఇచ్చింది. జగన్ ప్రభుత్వం శెట్టిబలిజ కార్పొరేషన్‌కు ఈ నాలుగు సంవత్సరాల్లో ఒక్క రూపాయి ఇవ్వ లేదు.

-సూరిబాబు, రాష్ట్ర శెట్టి బలిజ సాధికార సమితి డైరెక్టర్

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

క్రైస్తవులపై దాడులు నివారించాలి

ఆకివీడు, మార్చి 6: దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దౌర్జన్యాలు, దాడులను నివారించాలని సీబీఎం జాతీయ అధ్యక్షుడు, బిషప్ ఏంపీవీ ప్రసాద్‌రాజు అన్నారు. బుధవారం మినీ బైపాస్‌రోడ్‌లోని సీబీఎం క్యాంపస్ క్రైస్తవ పార్థన మందిరంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. క్రైస్తవులపై దాడులు నివారించాలని, రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులకు అన్ని రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీబీసీఎంసీ రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్‌రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృతరావు, ఏబీసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రత్నకుమార్, ఎస్పీబీ భీమవరం కోఆర్డినేటర్ జేమ్స్ పాల్గొన్నారు.

రక్తదానం



భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 6: డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి గాదిరాజు బాబు, ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు చేతలు మీదుగా ప్రారంభించారు. శిబిరంలో సుమారు 120 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

గ్రామాల్లో మౌలిక వసతులు: పీవీఎల్



దొడ్డనపూడిలో ఓహెచ్‌ఎస్‌ఆర్‌ను ప్రారంభించి మహిళకు బిందెతో నీరు ఇస్తున్న పీవీఎల్

కాళ్ళ, మార్చి 6: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పడుతున్నాయని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. జక్కరంలో సచివాలయ భవనం, ఎల్ఎన్‌పురం, దొడ్డనపూడి, కోమటిగుంట గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకులను బుధవారం పీవీఎల్ నరసింహరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, సర్పంచ్‌లు తానింకి నాగరాజు, బోనం భాగ్యలక్ష్మి శివకుమార్, కూచంపూడి పద్మావతి పాల్గొన్నారు.

గొల్లలకోడేరులో సురక్ష వైద్య శిబిరం

పాలకోడేరు, మార్చి 6 : గొల్లలకోడేరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగంనాయుడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కంటి వైద్య పరీక్షలు, జనరల్ వైద్యం నిపుణులచే అనేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణనిరంజని, డాక్టర్ లీలాలక్ష్మి, కంటి వైద్య నిపుణులు రాజాబాబు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

భీమవరం టౌన్, మార్చి 6 : జీడీవీ ఫౌండేషన్ ఫౌండర్ జి.రాజేష్ ఖన్నా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. చెరుకువాడ గ్రామానికి చెందిన పాస్టర్ హేమకుమార్ కుమారుడు వెస్లీ 24 గంటల నొప్పితో బాధపడుతూ భీమవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ హేమ కుమార్, పాస్టర్ సురేష్ పాల్, యర్రింకి జెవెల్ రాజు, చెక్కు తేజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

భీమవరం టౌన్, మార్చి 6: మహిళలు అన్ని రంగాలలో విజయం సాధించి ముందుకు సాగాలని ఆర్డీవో సీహెచ్ శ్రీనివాసులు రాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. విశిష్ట సేవాతత్పరులను సత్కరించి వివిధ పోటీల్లో విజేతలైన 63 మందికి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, చెరుకువాడ రంగసాయి, మెప్మా ముఖ్య కార్యదర్శి అనంత లక్ష్మి, పీఎస్ఎం హెచ్ఎం సుధారాణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఉండి: మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. బుధవారం చిలుకూరులోని అంగన్‌వాడి కేంద్రంలో మహిళదినోత్సవం నిర్వహించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

భీమవరం టౌన్, మార్చి 6 : భీమవరం యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మహిళాదినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులు, మహిళా ఖాతాదారులకు జువ్వలపాలెం రోడ్ గౌతమి నర్సింగ్ హోమ్‌లో బుధవారంనాడు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ హెడ్ పి.సంగీత కుమారి పాల్గొన్నారు.

'అవమానాలు భరించలేకే వైసీపీకి రాజీనామా'



సర్పంచ్ అనంతలక్ష్మి దంపతులు

ఆకివీడు రూరల్ మార్చి 6 : పార్టీలో అవమానాలు భరించలేకే వైసీపీకి రాజీనామా చేసినట్లు గుమ్ములూరు గ్రామ సర్పంచ్ కోట అనంతలక్ష్మి, ఆమె భర్త కోట చిన్న ప్రకటించారు. బుధవారం తన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాభివృద్ధి చెయ్యకుండా గ్రామంలోని వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పంచాయతీ నిధులు ఏమీ లేవని, తమ సొంత నిధులతో మంచినీటి చెరువు తవ్వించామని తెలిపారు. గ్రామంలో మండలపార్టీ అధ్యక్షులు, మండల యూత్ అధ్యక్షులు ఉన్నప్పటికి తనకు సహకరించడం లేదన్నారు. తన బాధను డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదని అన్నారు. విలువ లేని చోట పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

విద్యా కార్యాచరణపై డీఈవో సమీక్ష

వీరవాసరం, మార్చి 6: రాయకుదురు జడ్పీహైస్కూల్‌ను బుధవారం డీఈవో ఆర్. వెంకటరమణ సందర్శించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవతరగతి పరీక్షలు నేపథ్యంలో హైస్కూల్‌లో అమలు చేస్తున్న విద్యాకార్యాచరణపై సమీక్షించారు. సి, డి గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులను ఏ విధంగా బి, ఎ గ్రేడ్‌లకు తీసుకురావటానికి సంబంధింత ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో ఎక్కువ మార్కులను సాధించటానికి ఉపయోగపడే విషయాలపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు.

భోగలింగేశ్వరునికి వెండి రుద్రాక్ష మండప అలంకారం



భీమవరం టౌన్,మార్చి 6 : బీవీరాజు మునిసిపల్ పార్కు వద్ద ఉన్న భోగ లింగేశ్వరస్వామికి 30 కేజీల వెండితో తయారు చేయించిన రుద్రాక్ష మండపాన్ని బుధవారంనాడు అలంకరించారు. ఇందులో భాగంగా మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం 11-15 గంటలకు స్వామి వారికి అలంకారం చేసి బూరలను పోసి తమ మొక్కులను తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసే కార్యక్రమం నిర్వహించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నరసాపురం, మార్చి 6: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో బుధవారం ఛైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరావు ఆకస్మిక తనిఖీలు చేశారు. వార్డులో డ్రెయినేజీ, పారిశుధ్య పనుల్ని పరిశీలించారు. రెగ్యులర్‌గా డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్నారా లేదా తాగునీటి సరఫరాపై ప్రజల్ని ఆరా తీశారు. కౌన్సిలర్ తాడి సునీత, వంగా శ్రీకాంత్ కన్నా, కేసరి గంగరాజు, కావలి నాని, టీపీవో శేషగిరి పాల్గొన్నారు.

జనంలోకి జనసేన

నరసాపురం రూరల్, మార్చి 6: తూర్పుతాళ్ళు గ్రామంలో రెండోవ రోజు బుధవారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్వీనర్ బొమ్మిడి నాయకర్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

పుర్‌నూర్ మసీదు పునః ప్రారంభం

నరసాపురం టౌన్, మార్చి 6: పట్టణంలోని పాతబజార్‌లో ప్రసిద్ధిగాంచిన పుర్‌నూర్ మసీదు ప్రారంభోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మతాలకు అతీతంగా జనం హాజరై ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా ముస్లింలు నమాజ్ చేశారు. ఆ తరువాత మసీద్ నిర్మాణానికి సహకరించిన దాతల్ని సత్కరించారు. అనంతరం సుమారు 5వేల మందికి అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, జానకీరామ్, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, నాయకర్, షేక్ బుల్లిమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి 2కేజీల వెండి తొడుగు బహూకరణ

భీమవరం టౌన్, మార్చి 6 : గునుపూడిలోని సోమేశ్వర జనార్దన స్వామి వారికి పట్టణానికి చెందిన దాసరి వెంకటేశ్వర రావు, వెంకట సత్యవతి దంపతులచే 2కేజీల బరువు కలిగిన వెండి తొడుగు సమర్పించారు. ముందుగా స్వామివారిని దాతలు దర్శించుకున్నారు. దేవస్థానం తరుపు ప్రసాదాన్ని,శేష వస్త్రాన్ని అందించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 6: తాడేపల్లిగూడెం తాలూకా రైల్వేగూడ్స్ యూనియన్ వర్కర్స్ 40వ వార్షికోత్సవం సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సత్తికోదండ రామిరెడ్డి సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా సత్తి కోదండ రామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కర్రి సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చిర్ల పుల్లారెడ్డి, సహాయ కార్యదర్శిగా కర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎస్వీయస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

పెనుమంట్ర, మార్చి 6 : మినీ లారీ ఢీ కొట్టిన సంఘటనలో మోటర్ సైకిల్ పై వెళ్తున్న ఇరువురు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారంనాడు నెగ్గిపూడి పంచాయితీ కార్యాలయం ఎదురుగా జరిగింది. ఈ సంఘటనలో ఇరగవరం మండలం ఏలేటిపాడుకు చెందిన దాసరి శేఖర్, తల్లికి తీవ్రగాయాలు అయ్యాయి. డ్రైవర్ లారీని వదలి పరారు అయ్యాడు.

మహిళలపై వివక్ష వద్దు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 6: మహిళలపై వివక్షతను పారదోలాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు పేర్కొన్నారు. నవాబుపాలెంలో బుధవారం మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు పి. ఆశాలత, ఆరోగ్య కార్యకర్త విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంఈవో ప్లేట్ల వితరణ

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 6: పేదరికాన్ని రూపుమాపేందుకు చదువే ఆయుధమని ఎంఈవో వి. హనుమ పేర్కొన్నారు. ఆరుగొలను ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఈవో వి. హనుమ తన సతీమణి పద్మశ్రీ వర్ధంతి సందర్భంగా రూ.7500 విలువ చేసే భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు.

లోకేశ్‌ను కలిసిన అంగర రామ్మోహన్



పాలకొల్లు టౌన్, మార్చి 6: గన్నవరం విమానాశ్రయంలో యువనాయకుడు నారా లోకేశ్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ కలిశారు. మంగళగిరిలో విజయంతంగా జరిగిన టీడీపీ బీసీ జయహో సభ గురించి ఇరువురు మాట్లాడుకున్నారు. టీడీపీ జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టబోయే బీసీల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పట్ల బీసీ కులాలు వారు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని లోకేశ్‌కు తెలిపారు.

పోలీసు కవాతు

ఆచంట, మార్చి 6: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బుధవారం ఆచంటలో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించేందుకు పోలీసు భద్రత ఉంటుందని తెలిపేందుకు కవాతు నిర్వహించినట్టు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించేందుకు తాము సమాయత్తంగా ఉన్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామని తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో కేంద్ర బలగాలు, తాడేపల్లిగూడెం సర్కిల్ పోలీస్ సిబ్బందితో గురువారం కవాతు నిర్వహించారు. సీఐలు సుబ్రహ్మణ్యం, రమేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

పాలకొల్లు రూరల్, మార్చి 6: పాలకొల్లు బీబీఆర్ఎం గర్ల్స్ మున్సిపల్ హైస్కూల్‌లోని పదవ తరగతి చదువుతున్న 152 మంది విదార్థులకు పాలకొల్లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష అట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్‌రావు, కార్యదర్శి రావాడ సతీష్, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, స్కూల్ హెచ్ఎం ప్రభాకరశాస్త్రి పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకం

ఉండి, మార్చి 6:ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల బాధ్యత కీలకమైనదని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సెక్టార్ అధికారులతో శిక్షణా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టరు నిర్వహించారు. జేసీ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకుని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. సెక్టార్ అధికారుల పరిధిలోని పోలింగ్‌స్టేషన్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించుకుని సిద్ధంగా వుండాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషనులకు చేరుకోవడానికి బస్సు రూట్ మార్గాలను నిశితంగా పరిశీలించుకోవాలన్నారు.

రహదారి నిర్మించకుంటే ధర్నా

అత్తిలి, మార్చి 6 : రహదారి నిర్మాణం చేపట్టకపోవడం వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని రహదారి నిర్మించకపోతే ధర్నా చేస్తానని కంచుమర్రు సర్పంచ్ పెనుమత్స వెంకట కృష్ణంరాజు హెచ్చరించారు. అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగింది. మంచిలి నుంచి కంచుమర్రు వరకు రహదారి పనులు చేపట్టకుంటే ధర్నా చేస్తానని సర్పంచ్ అనడంతో సభలో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. దీంతో వేదికపై మీద ఉన్న ఏఎంసీ ఛైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్ జోక్యం చేసుకుని ధర్నా చేస్తాననడం సరికాదని రోడ్డు వేయమని కోరాలని అనడంతో సభ సద్దుమణిగింది.

కట్నం వేధింపుల కేసు నమోదు

ఉండి, మార్చి 6: వరకట్న వేధింపుల కేసు నమోదు అయ్యిందని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. చెరుకువాడకు చెందిన వాగోలు సుకన్యకు విస్సాకోడేరుకు చెందిన రమేశ్‌తో 2009లో వివాహమైంది. కొద్దిరోజులు నుంచి భర్త రమేశ్ మద్యానికి బానిసై వరకట్నం తీసుకుని రావాలని వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంట దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ

భీమవరం, మార్చి 6: జిల్లాలో ఖరీఫ్ - 2023 వర్షాభావ పరిస్థితుల కారణంగా 15,923,86 హెక్టార్లలో పంట నష్టపోయిన 32,545 మంది వ్యవసాయ, ఉద్యానవన రైతులకు మంజూరైన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.26.72 కోట్ల రూపాయల నమూనా చెక్కును జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి రైతులకు అందించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించి, ఈ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందిస్తు న్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు



వీరంపాలెం వద్ద స్వాగత ద్వారాలు

ఆకివీడు, మార్చి 6: శివరాత్రి పురస్కరించుకుని పట్టణంలో శైవక్షేత్రాలు ముస్తాబౌతున్నాయి. జవహర్‌పేటలోని రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో 8న స్వామికి అభిషేకాలు, కలశపూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సూక్త హోమం, సాయంత్రం లక్షబిల్వార్చన, లక్ష కుంకుమార్చన, లక్ష దీపారాధన, రాత్రికి అన్నాభిషేకం, రుద్రహోమం నిర్వహిస్తారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, రాత్రికి తెప్పోత్సవం, వీరభద్రస్వామి దేవాలయంలో గంగాస్నానం, ప్రభ, అలుగులు, విచిత్ర వేషాలు, సంబరం, రాత్రికి నిప్పులగుండం, మార్చి 17న అన్నసమారాధన జరుగుతుంది.

పాలకొల్లు టౌన్: పాలకొల్లు లాకు దిగువ కొత్తపేటలో శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. మహాశివరాత్రి పర్వదినం రోజు 210వ ంది మహిళలతో కళశాలతో పూజలు భారీ ఊరేగింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధ్యక్ష,కార్యదర్శులు పట్టం గణేష్, మానెం బసవరాజు, బాసిన గుణ్ణేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిప్పులు గుండం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తణుకు: ఉమా సిద్దేశ్వర స్వామి ఆలయంకు ప్రత్యేక చరిత్ర ఉంది. గోస్తనీ నదీ తీరం వందల శతాబ్దాల చరిత్ర గల శైవారామ క్షేత్రాలకు పుట్టినిల్లు. అటువంటి దివ్య శైవ క్షేత్రములో ఒకటై, తణుకులో ఉన్న శ్రీ సిద్దేశ్వర లింగం మహర్షులతో ప్రతిష్ఠితమైనట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. స్వామివారిని అభిషేకిస్తే మంచి ఫలితాలుంటాయని ప్రతీతి.

తేతలిలో.. తేతలిలోని రాజేశ్వర స్వామి ఆలయంలోని శివ లింగం బ్రహ్మసూత్రంతో స్వయంగా వెలిసినది. ఆలయంలో అర్చనకు సంబంధించినవి ఏమి చేసినా కోటిసార్లు చేసిన ఫలితమునిచ్చును. ఇది స్వయంభూలింగమై బ్రహ్మసూత్ర చిహ్నముతో కూడి ఉండటం విశేషం. ఆయా ఆలయాల్లో ఈనెల 10వ తేదీ వరకు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకట రమణ సిద్ధాంతి ఏర్పాట్లు చేయగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి బుధవారం పర్యవేక్షించారు. అలాగే మండలంలోని నీలాద్రిపురం, కుంచనపల్లి, కొండ్రుప్రోలు, కడియద్ద, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, మాధవరం అప్పారావుపేట ఆలయాలు సన్నద్ధమయ్యాయి.

నంది వాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

పెనుగొండ, మార్చి 6: పెనుగొండలో నగరేశ్వర మహిషాసుర మర్దని, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాశివ రాత్రి పురస్కరించుకుని బుధవారం స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై ఊరేగించారు. శ్రీ అమ్మవార్లకు విశేష అర్చనము, హోమాలు, బలి హరణలు నిర్వహించారు.

భక్తులకు ఏర్పాట్లు చెయ్యాలి

భీమవరం టౌన్, మార్చి 6 : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమేశ్వర, జనార్ధనస్వామివార్ల ఆలయంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాటు చెయ్యాలని దేవదాయధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు సూచించారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్‌లు, చలువ పందిళ్ళు, విద్యుద్దీకరణ, రథోత్సవం, తెప్పోత్సవం ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున భక్తులకు మంచినీటి సౌకర్యం, పారిశుధ్యం, మరుగుదొడ్ల ఏర్పాట్లును చెయ్యాలన్నారు.